క్లుప్తంగా

వాహనాల తనిఖీ



ధ్రువపత్రాలను పరిశీలిస్తున్న ఎస్సై

కెరమెరి: ధ్రువపత్రాలు లేకుండా వాహనం నడిపితే కేసులు నమోదు చేస్తామని ఎస్సై ఎస్.మధుకర్ అన్నారు. మండలకేంద్రంలో శనివారం వాహనాల తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా వాహనాలను క్షుణ్ణంగా తనిఖీ చేసి డ్రైవింగ్ లైసెన్స్‌తోపాటు వాహనపత్రాలను పరిశీలించారు. ఆటోలు, జీపుల్లో పరిమితి మించి ప్రయాణికులను తీసుకెళ్లొద్దని యజమానులకు సూచించారు. ద్విచక్రవాహనదారులు హెల్మెట్ ధరించాలన్నారు. పోలీసు సిబ్బంది ఉన్నారు.

షీటీం సేవలు సద్వినియోగం చేసుకోవాలి



అవగాహన కల్పిస్తున్న షీటీం సభ్యులు

ఆసిఫాబాద్‌రూరల్: షీటీం అందిస్తున్న సేవలను సద్వినియోగం చేసుకోవాలని షీటీం సభ్యురాలు స్వప్న కోరారు. జిల్లాకేంద్రంలోని జన్కాపూర్ ఉన్నత పాఠశాలలో శిక్షణ తీసుకుంటున్న టీచర్లకు షీటీం సేవలపై శనివారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళలకు ఎల్లవేళలా అందుబాటులో ఉండి భద్రత కల్పిస్తామన్నారు. పాఠశాలలకు వచ్చే విద్యార్థుల ప్రవర్తన గమనిస్తూ ఉండాలని, సహా ఉపాధ్యాయులు ఎవరైనా అసభ్యకరంగా ప్రవర్తించినా సమాచారం ఇవ్వాలన్నారు. ఎంఈవో సుభాష్, షీటీం సభ్యులు రజిత, దినేష్, శ్రీలత తదితరులు పాల్గొన్నారు.

పోగొట్టుకున్న సెల్‌ఫోన్లు అప్పగింత



సెల్‌ఫోన్ అప్పగిస్తున్న ఎస్సై ప్రశాంత్

వాంకిడి: పోగొట్టుకున్న రెండు సెల్‌ఫోన్లను ఎస్సై ప్రశాంత్ శనివారం బాధితులకు అప్పగించారు. మండలంలోని ఖమాన గ్రామానికి చెందిన శ్రీకాంత్, లక్ష్మీనగర్‌కు చెందిన ఎస్కే రుక్సానా ఇటీవల సెల్‌ఫోన్లు పోగొట్టుకున్నారు. ఈమేరకు బాధితులు పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. సీఈఐఆర్ వెబ్‌సైట్‌లో వివరాలు నమోదు అనంతరం ఫోన్ల సిగ్నల్ ట్రేసి పట్టుకుని బాధితులకు సెల్‌ఫోన్లు అప్పగించారు. ఫోన్లను ట్రేస్ చేయడంతో ప్రతిభకనబర్చిన కానిస్టేబుల్ నయీమ్‌ను ఎస్సై అభినందించారు.

సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ సమావేశం

రెబ్బెన: బెల్లంపల్లి ఏరియా ఖైర్‌గూడ ఓపెన్‌కాస్ట్‌లో శనివారం సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ ఖైర్‌గూడ పిట్ కార్యదర్శి మారం శ్రీనివాస్ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఏఐటీయూసీ డిప్యూటీ జనరల్ సెక్రెటరీ ముష్క సమ్మయ్య, గోలేటి బ్రాంచి కార్యదర్శి తిరుపతి ముఖ్య అతిథులుగా హాజరై మాట్లాడారు. స్ట్రక్చర్ కమిటీలో జరిగిన అనేక విషయాల గురించి కార్మికులకు తెలిపారు. 90 కోట్ల పెరిక్స్‌పై కార్మికులు కడుతున్న ట్యాక్స్ కంపెనీ కట్టేవిధంగా, సొంతింటి పథకం అమలు, ఎంప్లాయీస్‌కు కార్పొరేట్ ఆసుపత్రి, పిల్లలకు సెంట్రల్ సిలబస్ విద్య బోధించడం, తదితర అనేక విషయాలను కార్మికులకు వివరించారు. ఏఐటీయూసీ ఉపాధ్యక్షుడు బయ్య మొగిలి, ఆర్గనైజింగ్ కార్యదర్శులు శేశరావు, కిరణ్‌బాబు, చంద్రశేఖర్, సహాయ కార్యదర్శులు ఓదెలు తదితరులు పాల్గొన్నారు.

పశువులకు వింతవ్యాధి



దహెగాం: మండల కేంద్రంలోని పశువులకు వింతవ్యాధి సోకుతుంది. పశువుల చర్మంపై బొబ్బలు ఏర్పడుతున్నాయని పలువురు రైతులు పేర్కొంటున్నారు. రోజురోజుకు ఈ వ్యాధి ఎక్కువవుతుందన్నారు. చిన్న లేగదూడలకు సైతం వ్యాధి సోకుతుందన్నారు. ఈ విషయమై పశువైద్యాధికారి రమేశ్‌ను సంప్రదించగా లంపీస్కిన్ వ్యాధి అని నిర్ధారించారు. ఈ వ్యాధిసోకిన పశువును బయట విడిచిపెట్టొద్దన్నారు. బయట తిరగడం వల్ల ఒకదాని నుంచి మరో దానికి సోకే అవకాశాలు ఉన్నాయన్నారు. స్థానిక పశువైద్యశాలలో వైద్యం అందుబాటులో ఉందన్నారు.

ప్రమాదకరంగా రోడ్డు



కెరమెరి: మండలంలోని లేండిగూడకు వెళ్లే రోడ్డు ప్రమాదకరంగా మారింది. లేండిగూడ నుంచి కెరమెరి వచ్చేక్రమంలో రోడ్డు కోతకు గురైంది. ఎవరైనా ఆదమరిచి వస్తే పడిపోయే ప్రమాదం ఉంది. అధికారులు, ప్రజాప్రతినిధులు వెంటనే పట్టించుకుని చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

సిగ్నల్ లేక ఇక్కట్లు..



కెరమెరి: మండలంలోని తెలంగాణ- మహారాష్ట్ర సరిహద్దు గ్రామాలకు సిగ్నళ్లు లేవు. గౌరీ, లేండిగూడ, బోలాపటార్, నారాయణగూడ, ఏసాపూర్, పద్మావతి, అంతాపూర్, మహరాజ్‌గూడ గ్రామాల్లో మొబైల్ నెట్‌వర్క్ లేదు. దీంతో గుట్ట, గోడలపై ఎక్కి సిగ్నల్ వెతుక్కోవాల్సిందే. ఇతరులకు ఫోన్‌చేసి సమాచారం తెలుసుకోవాలన్నా ఇబ్బంది తప్పడం లేదు. అధికారులు సెల్‌టవర్ ఏర్పాటుచేయాలని గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

మహిళా సంఘాలకు కొత్త సారథులు

- కొనసాగుతున్న గ్రామైక్య సంఘాల ఎన్నికలు
- ఈనెల 22న మండల సమాఖ్య పదాధిపతుల ఎన్నిక
- మండలంలో 36 వీవోలు, 727 ఎస్‌హెచ్‌జీలు



ఖమానాలో సంఘ సమావేశంలో ఏపీఎం మహేశ్ (ఫైల్)

వాంకిడి: మహిళా స్వయం సహాయక సంఘాలకు కొత్త సారథుల ఎన్నికలు కొనసాగుతున్నాయి. గ్రామాల్లో జనరల్ బాడీలు నిర్వహించి సంఘ సభ్యుల నుంచి పాలకవర్గం, కార్యనిర్వాహక వర్గాలను ఎన్నుకుంటున్నారు. ఎన్నికల నిర్వహణపై ఇప్పటికే శిక్షణ పొంది ఉన్న ఐకేపీ అధికారులు అవగాహన కల్పిస్తున్నారు. నూతన సారథుల ఎన్నిక ద్వారా అందరిలో నాయకత్వ లక్షణాలు ఏర్పడే అవకాశాలు ఉన్నాయి. లావాదేవీల్లో కీలకంగా మారనున్న ఈ కొత్త పదాధిపతుల ఎన్నిక ప్రక్రియను ఈనెల చివరిలోగా పూర్తి చేయనున్నట్లు అధికారులు పేర్కొంటున్నారు. మండలంలో మొత్తం 36 వీవోలు ఉండగా, 727 స్వయం సహాయక సంఘాలున్నాయి. అందులో 7800 మంది వరకు సభ్యులు ఉన్నారు.

కొత్త వారికి అవకాశం

స్వయం సహాయక సంఘాల్లోని కొత్తవారికి అవకాశాలు కల్పిస్తూ సెర్ప్ అధికారులు పదాధిపతులను ఎన్నుకుంటున్నారు. స్వయం సహాయక సంఘాల్లో కనీసం 10 మంది నుంచి 15 మంది సభ్యులు ఉంటారు. గ్రామాల్లో సంఘాల సభ్యులతో ఇప్పటికే సమావేశాలు నిర్వహించి నాయకులను ఎన్నుకుంటున్నారు. ఆసక్తి ఉన్న మహిళలకు సమావేశంలో అవగాహన కల్పించి నియామకాలు చేపడుతున్నారు. ఏకగ్రీవం లేదా చేతులు పైకెత్తి ఎన్నుకోవడం, చీటీలు రాసి సభ్యురాలి మద్దతు ప్రకటించడం వంటి పద్ధతుల్లో ఏదో ఒక విధానంతో ఎన్నుకుంటున్నారు. సంఘాల ద్వారా ఎన్నికైన సారథులతో గ్రామైక్య పదాధిపతుల ద్వారా మండల సమాఖ్య పదాధిపతులను ఎన్నుకోనున్నారు. గ్రామాల్లో వీవోల వారీగా ఎన్నికలు నిర్వహిస్తుండగా ఈనెల 22న మండల సమాఖ్య నూతన కార్యవర్గాన్ని ఎన్నుకోనున్నట్లు సెర్ప్ అధికారులు తెలుపుతున్నారు. అనంతరం మండల సమాఖ్యల ద్వారా జిల్లా సమాఖ్యను ఎన్నుకుంటారు.

పదాధిపతులదే కీలకపాత్ర

స్వయం సహాయక సంఘాల లావాదేవీల విషయంలో సంఘాల పదాధిపతుల పాత్ర కీలకంగా ఉంటుంది. సంఘాలకు ప్రభుత్వం రుణాలు మంజూరు చేయడం, శ్రీనిధి రుణాలు ఇస్తుండటంతో మహిళలు ఆర్థికంగా ఎంతో బలోపేతం అవుతున్నారు. మహిళలు ఓవైపు కుటుంబ బాధ్యతలు నిర్వర్తిస్తూనే మరోవైపు రుణసాయం పొందుతూ చిరు వ్యాపారాల్లో రాణిస్తూ ఆర్థికంగా స్వయం ఉపాధిని పొందుతున్నారు. ప్రతీనెల క్రమం తప్పకుండా పొదుపు డబ్బులతోపాటు శ్రీనిధి, రాయితీ రుణడబ్బులు కూడా బ్యాంకుల్లో జమ చేస్తున్నారు. ఈ ప్రక్రియల్లో సంఘాల పదాధిపతుల పాత్ర కీలకంగా మారనుంది. మండలంలో మహిళా సంఘాల సభ్యులు కోట్ల రూపాయల లావాదేవీలు జరిపిస్తూ లబ్ధి పొందుతున్నారు.

కొత్త బైలా ప్రకారం మార్పులు

సెర్ప్ కొత్త బైలా ప్రకారం స్వయం సహాయక సంఘాలకు కొత్త నాయకత్వం ఎన్నికలు జరిపే ప్రక్రియ కొనసాగుతుంది. ఇప్పటికే వీవోల వారీగా జనరల్ బాడీ సమావేశాలు నిర్వహించి నూతన పదాధిపతులను ఎన్నుకుంటాం. ఇంకో రెండురోజుల్లో గ్రామస్థాయిలో సమావేశాలు పూర్తవుతాయి. ఈనెల 22న మండల సమాఖ్య సమావేశం నిర్వహించి కొత్త సారథులను ఎన్నుకునేలా చర్యలు తీసుకుంటాం.

– మహేశ్, ఏపీఎం

సొంత భవనాలు కరువు



పాఠశాల పాత భవనంలో తహసీల్దార్ కార్యాలయం

- అద్దె, తాత్కాలిక భవనాల్లో ప్రభుత్వ కార్యాలయాలు
- అరకొర సౌకర్యాల మధ్య నిర్వహణ
- ఇబ్బంది పడుతున్న సిబ్బంది,
- ప్రజలకు తప్పని తిప్పలు

లింగాపూర్: పాలన సౌలభ్యం కోసం గత ప్రభుత్వ హయాంలో మండలాలు ఏర్పాటు చేసింది. సిర్పూర్(యూ) నుంచి విడిపోయి 40కు పైగా గ్రామాలతో లింగాపూర్ మండలం ఏర్పడి దాదాపు ఎనిమిదేళ్లవుతున్నా నేటికి ప్రభుత్వ కార్యాలయాలకు సొంత భవనాలు నిర్మించలేదు. అద్దె, తాత్కాలిక భవనాల్లో కార్యాలయాలు కొనసాగుతున్నాయి. మండల కేంద్రంలోని పాత ప్రభుత్వ పాఠశాల భవనంలో తహసీల్దార్ కార్యాలయం, ఎంపీడీవో కార్యాలయాన్ని పంచాయతీ భవనంలో, మహిళా సమాఖ్య భవనం శిథిలావస్థకు చేరినా ఆసుపత్రి భవనంలో కొనసాగుతోంది. ఆయాచోట్ల సరిపడా గదులు లేకపోవడం, మరుగుదొడ్లు తదితర సౌకర్యాలు లేవు. అరకొర సౌకర్యాల మధ్య నిర్వహిస్తుండడంతో ఉద్యోగులు, సిబ్బంది ఇబ్బందులు పడుతున్నారు. వివిధ పనుల నిమిత్తం కార్యాలయాలకు వచ్చే ప్రజలు ఇక్కట్లు ఎదుర్కొంటున్నారు. మండల కేంద్రంలో తహసీల్దార్, ఎంపీడీవో కార్యాలయాలకు పక్కా భవనాలు నిర్మించేందుకు జిల్లా అధికారులు గతంలో పలు ప్రభుత్వ భూములను పరిశీలించారు. నేటికి ఎలాంటి చర్యలు తీసుకోలేదు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి ప్రభుత్వ కార్యాలయాలు సొంత భవనాలు నిర్మించాలని మండల వాసులు కోరుతున్నారు.

సొంత భవనాలు నిర్మించాలి



ప్రభుత్వ కార్యాలయాలు తాత్కాలిక భవనాల్లో కొనసాగుతున్నాయి. సౌకర్యాలు లేక దూరప్రాంతాల నుంచి వచ్చే ప్రజలకు ఇబ్బంది పడుతున్నారు. అధికారులు స్పందించి సొంత భవనాలు నిర్మించి సౌకర్యాలు కల్పించాలి. – జాటోత్ రాహుల్, లింగాపూర్

కారుణ్య నియామకాలకు ఇంటర్వ్యూలు

రెబ్బెన: సింగరేణి ఉద్యోగం చేస్తూ మెడికల్ ఇన్వాలిడేషన్ అయిన ఉద్యోగుల వారసులకు గోలేటిలోని జీఎం కార్యాలయం కాన్ఫరెన్స్ హాల్‌లో శనివారం ఇంటర్వ్యూలు నిర్వహించారు. మెడికల్ ఇన్వాలిడేషన్ అయిన ఐదుగురు ఉద్యోగుల వారసుల కారుణ్య నియామకం కోసం దరఖాస్తు చేసుకున్నారు. ఇంటర్వ్యూలకు హాజరైన అభ్యర్థులు, కుటుంబ సభ్యులను ఎస్ఓ టు జీఎం రాజమల్లు పర్సనల్ మేనేజర్ రెడ్డిమల తిరుపతి ప్రశ్నించి ధ్రువపత్రాలను పరిశీలించారు. సింగరేణి ద్వారా అందే బెనిఫిట్స్ గురించి అవగాహన కల్పించారు. అధికారులు, ఉద్యోగులు అఫ్జన్‌పాషా, మహేశ్, వేణు, రజనీకుమార్ తదితరులు పాల్గొన్నారు.

కుక్కల దాడిలో చుక్కల దుప్పి హతం



చుక్కల దుప్పి కళేబరం

కాగజ్‌నగర్‌రూరల్: మండలంలోని కొత్త సార్సాల శివారులో శనివారం కుక్కల దాడిలో చుక్కల దుప్పి హతమైంది. అటవీప్రాంతం నుంచి గ్రామ పొలిమేరకు దుప్పి రాగా కుక్కలు వెంబడించడంతో గ్రామస్తులు రక్షించి అటవీ అధికారులకు సమాచారం అందజేశారు. పశువైద్యాధికారులు, అటవీ అధికారులు సంఘటన స్థలానికి చేరుకుని చుక్కల దుప్పికి చికిత్స అందించినప్పటికీ తీవ్ర గాయాలు కావడంతో అప్పటికే మృతిచెందింది. ఎఫ్‌బీవో శ్రీవాణి ఆధ్వర్యంలో పంచనామా నిర్వహించి దుప్పిని దహనం చేశారు.

ఆరోగ్యానికి మొదటి ప్రాధాన్యతనివ్వాలి



మాట్లాడుతున్న ఇన్‌చార్జి జీఎం నరేందర్

రెబ్బెన: సింగరేణి ఉద్యోగులు ఆరోగ్యానికి మొదటి ప్రాధాన్యతనివ్వాలని బెలంపల్లి ఏరియా ఇన్‌చార్జి జీఎం మచ్చగిరి నరేందర్ అన్నారు. మండలంలోని గోలేటిలోని సింగరేణి డిస్పెన్సరీలో శనివారం నిర్వహించిన ప్రపంచ రక్తపోటు దినోత్సవం కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉద్యోగులు సమతుల్య పోషకాహారం తీసుకుంటూ ధ్యానం, వ్యాయమం చేయాలన్నారు. క్రమం తప్పకుండా వైద్యపరీక్షలు చేయించుకోవాలన్నారు. డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ మురళీమోహన్ రక్తపోటును అదుపులో ఉంచుకునేందుకు తీసుకోవాల్సిన ఆహారం నియామాలను వివరించారు. కార్యక్రమంలో ఏరియా ఇంజనీర్ రామనాథం, డీజీఎం(సివిల్)ఎస్‌కె మదీన బాషా, మెడికల్ సుపరింటెండెంట్ స్టాలిన్ బాబు, పర్సనల్ మేనేజర్ తిరుపతి, వేణు తదితరులు పాల్గొన్నారు.

హోరాహోరీగా నెట్‌బాల్ పోటీలు

- ముగిసిన రెండు కేటగిరీల పోటీలు
- నేడు ముగింపు, బహుమతుల ప్రదానం
- జిల్లా క్రీడాకారుల ప్రతిభ

జనగామ: జనగామ జిల్లా కేంద్రంలోని బతుకమ్మ కుంటలో రాష్ట్రస్థాయి 8వ సబ్ జూనియర్ అండర్ –16 నెట్‌బాల్ చాంపియన్ షిప్–2025 పోటీలు హోరాహోరీగా సాగుతున్నాయి. రాష్ట్రంలోని 25 జిల్లాల నుంచి 620 మంది బాలబాలికలు హాజరయ్యారు. ట్రెడిషనల్, ఫాస్ట్ –5, మిక్స్‌డ్ నెట్‌బాల్ పోటీల్లో మూడు కేటగిరీల వారీగా క్రీడాకారులు తలపడుతున్నారు. ఇందులో ట్రెడిషనల్, ఫాస్ట్ –5 రెండు కేటగిరీలకు సంబంధించి బాలుర, బాలికల లీగ్, క్వార్టర్, సెమీ, ఫైనల్ మ్యాచ్‌లు ముగిశాయి. మిక్స్‌డ్ డబుల్ నెట్‌బాల్ పోటీలు శనివారం సాయంత్రం ప్రారంభమయ్యాయి. ఫాస్ట్ –5 నెట్‌బాల్ బాలుర 4వ పోటీల్లో నారాయణపేట విజేతగా, ఖమ్మం ద్వితీయ స్థానంలో, మహబూబ్‌నగర్, కుమురంభీం ఆసిఫాబాద్ సంయుక్తంగా మూడో స్థానంలో నిలిచాయి. బాలికల విభాగంలో మేడ్చల్ విజేగా, ఖమ్మం ద్వితీయ స్థానంలో, జనగామ, కుమురంభీంఆసిఫాబాద్ జిల్లా సంయుక్తంగా మూడో స్థానంలో గెలుపొందాయి. ఆదివారం సాయంత్రం ముగింపు వేడుకల్లో విజేతలకు నిర్వాహకులు బహుమతులు, వ్యక్తిగతంగా ప్రశంస పత్రాలు ప్రదానం చేయనున్నారు.

అభ్యసన సామర్థ్యాలను పెంచాలి



మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటేశ్ దోత్రే

ఆసిఫాబాద్‌రూరల్: విద్యార్థుల్లో అభ్యసన సామర్థ్యాలు పెంపొందించాలని కలెక్టర్ వెంకటేశ్ దోత్రే సూచించారు. శనివారం జిల్లా కేంద్రంలోని తెలంగాణ మోడల్ స్కూల్ ఉపాధ్యాయులకు నిర్వహిస్తున్న శిక్షణ ముగింపు కార్యక్రమానికి హాజరై పలు సూచనలు చేశారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యను బోధిస్తూ పుస్తక పఠన సామర్థ్యాన్ని పెంపొందించాలని సూచించారు. ఎస్వో శ్రీనివాస్, ప్రిన్సిపాల్ మహేశ్వర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

దరఖాస్తుల ఆహ్వానం

ఆసిఫాబాద్‌రూరల్: 2025–26 విద్యాసంవత్సరంలో కార్పొరేట్ కళాశాలల్లో ఇంటర్, ఎంసెట్ కోచింగ్ ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి అధికారి సజీవన్ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. 10వ తరగతిలో 7జీపీఏ కంటే ఎక్కువ స్కోర్ చేసిన విద్యార్థులు ఈ నెల 31లోపు www.telanganaepass.cgg.gov.inలో దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. ప్రభుత్వ ఎయిడెడ్, గురుకులు, ఆశ్రమ, కేజీబీవీ, ఆదర్శ పాఠశాలలు, ప్రభుత్వ రంగ పాఠశాలల్లో పదోతరగతి పూర్తి చేసినవారే అర్హులని తెలిపారు.

నేటి నుంచి ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన మహోత్సవం

ఆసిఫాబాద్‌అర్బన్: జిల్లాకేంద్రంలోని పెద్దవాగు సమీపాన గొడవెల్లిలో పురాతన శ్రీ అభయాంజనేయస్వామి ఆలయంలో ఆదివారం నుంచి శిఖర, ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన మహోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ ప్రతినిధులు ఓ ప్రకటనలో తెలిపారు. ప్రతిష్ఠాపనాచార్యులు దహెగాం శ్రీనివాసశర్మ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు ఉంటాయని పేర్కొన్నారు. సోమవారం శిఖర, ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన, బలిహరణం, పూర్ణాహుతి, మహాదాశీర్వచనం, మహాప్రసాద వితరణ ఉంటుందని తెలిపారు. మధ్యాహ్నం 12 నుంచి మహా అన్నప్రసాద వితరణ నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

డే కేర్‌సెంటర్ ఏర్పాటుపై హర్షం

కాగజ్‌నగర్‌టౌన్:వయోవృద్ధుల సౌకర్యార్థం జిల్లాకు డే కేర్‌సెంటర్ ఏర్పాటుకు ప్రభుత్వం నిర్ణయించడంపై సీనియర్ సిటిజన్ రాష్ట్ర కార్యదర్శి మార్త సత్యనారాయణ ఓ ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. డే కేర్‌సెంటర్‌లో వయో వృద్ధుల కాలక్షేపం కోసం ఇండోర్‌గేమ్స్, కథల పుస్తకాలు, యోగా, మెడిటేషన్ చేసుకునేందుకు అవకాశం కల్పించడం ఉపయోగకరంగా ఉంటుందని పేర్కొన్నారు.

వాతావరణ కేంద్రం ఏర్పాటు

కెరమెరి: మండలంలోని ధనోరా గ్రామంలో విజయవాహిని చారిటబుల్ ఫౌండేషన్ నవరేటి ఇన్నోవేషన్ ప్రైవేట్ లిమిటెడ్ ఆధ్వర్యంలో శనివారం వాతావరణ సూచిక కేంద్రం ఏర్పాటు చేసి ప్రారంభించారు. ఇది రైతులకు చాలా ఉపయోగమని ఎప్పుడు వాన కురుస్తుంది. గాలిలో తేమ, గాలివేగం, రాళ్ల వర్షం, వాతావరణ వివరాలను తెలియజేస్తుందని ఆదర్శ రైతు కేంద్రె బాలాజీ తెలిపారు. రైతులకు ఫోన్ ద్వారా మేసెజ్ తెలియజేస్తామని సంస్థ సభ్యులు తెలిపారు. టవర్ చుట్టూ 5 కి.మీ దూరం వరకు వాతావరణ సమాచారం తెలియజేస్తుందని పేర్కొన్నారు. గోయగాం, సావర్‌ఖెడా, సుర్దాపూర్ గ్రామాల ప్రజలకు, రైతులతో ఎంతో ఉనయోగమని పేర్కొన్నారు.

అవగాహన కల్పించాలి

కెరమెరి: సమాజంలో జరుగుతున్న పోకడల గురించి గ్రామీణులు వయోజనులకు యువత అవగాహన కల్పించాలని ఎస్సై మధుకర్ అన్నారు. పోలీసులు మీ కోసంలో భాగంగా మండలంలోని కెలికే గ్రామంలో శనివారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. పోలీసులు మీకోసమే ఉన్నారని, ఏ సమస్య అయినా పరిష్కారం దిశగా చర్యలు తీసుకుంటామన్నారు. యువత సామాజిక కార్యక్రమాల్లో పాల్గొని అందరికి ఆదర్శంగా నిలవాలన్నారు. ఈ సందర్భంగా అక్కడి యవతకు వాలీబాల్ కిట్ అందించారు.

ఎన్డీయే కూటమికి వ్యతిరేకంగా నిరసన

కాగజ్‌నగర్‌రూరల్: ఎన్డీయే కూటమి అవలంబిస్తున్న విధానాలకు వ్యతిరేకంగా యువజన కాంగ్రెస్ ఆధ్వర్యంలో మండలంలోని గొల్లగూడలో శనివారం నిరసన వ్యక్తంచేశారు. ఈ సందర్భంగా జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకటేశ్, నియోజకవర్గ అధ్యక్షుడు శ్రీకాంత్ మాట్లాడుతూ శిక్ష న్యాయ సంవాద్ కార్యక్రమంలో భాగంగా బీహార్‌లోని అంబేద్కర్ హాస్టల్‌లో దళిత విద్యార్థులను కలిసి వారి స్థితిగతులను తెలుసుకోవడానికి వెళ్లిన కాంగ్రెస్ అగ్ర నాయకుడు రాహుల్‌గాంధీని దర్భంగాలో అక్కడి ఎన్డీయే కూటమి ప్రభుత్వం అడ్డుకోవడం సరికాదన్నారు. అనంతరం ప్రధాని మోదీ, బీహార్ సీఎం నితీశ్‌కుమార్ చిత్రపటాలను దహనం చేశారు. నాయకులు మధుకర్, శ్రీశైలం పాల్గొన్నారు.

సాదాసీదాగా సామాజిక తనిఖీ

- కార్యదర్శులు, టీఏలకు షోకాజ్ నోటీసులు
- పలువురికి జరిమానా, రికవరీ



సామాజిక తనిఖీ నిర్వహిస్తున్న అధికారులు

చింతలమానెపల్లి: ఎంపీడీవో కార్యాలయంలో శనివారం నిర్వహించిన ఉపాధిహామీ సామాజిక తనిఖీ సాదాసీదాగా జరిగింది. ఉదయం 9 గంటలకు అధికారులు తనిఖీ ప్రారంభించి మధ్యాహ్నం 2 గంటలకు పూర్తిచేశారు. మండలంలో 2024 ఏప్రిల్ నుంచి ఈ ఏడాది మార్చి వరకు రూ.4.21 కోట్లతో చేపట్టిన ఉపాధి పనులకు సంబంధించి సామాజిక తనిఖీ నిర్వహించినట్లు డీఆర్‌డీవో దత్తారాం తెలిపారు. మస్టర్లలో తప్పుడు వివరాలు నమోదు చేసినందుకుగాను ఇద్దరు పంచాయతీ కార్యదర్శులకు షోకాజ్ నోటీసులు ఇచ్చారు. బాలాజీ అనుకోడ పరిధిలో నాటిన మొక్కలు ఎండిపోగా ఇద్దరు టెక్నికల్ అసిస్టెంట్లకు నోటీసులు ఇచ్చారు. ఉపాధిహామీ కంప్యూటర్ ఆపరేటర్ మహేశ్ తప్పుడు వివరాలు నమోదు చేసినందుకు రికవరీ చేయాలని ఆదేశాలు జారీచేశారు. మండలంలో జరిగిన అక్రమాల్లో రూ.41,500 జరిమానా విధించగా, రూ.32,150లు రికవరీ చేయాలన్నారు. ఎంపీడీవో సుధాకర్‌రెడ్డి, ఎస్‌టీఎం వేణు, ఎస్ఆర్పీ కొమురయ్య, హెచ్‌ఆర్ మేనేజర్ మల్లేశ్, విజిలెన్స్ అధికారి ఆంజనేయులు, క్వాలిటీ కంట్రోల్ అధికారి రమేశ్, ఏపీవో షోయబ్ తదితరులు పాల్గొన్నారు.

నీటిఎద్దడి లేకుండా చర్యలు

కౌటాల: గ్రామాల్లో వేసవిలో నీటిఎద్దడి లేకుండా చర్యలు తీసుకోవాలని ఎంపీడీవో బి.రమేశ్ అన్నారు. కౌటాల పంచాయతీలో తాగునీటి సరఫరా పైప్‌లైన్, చేతిపంపు మరమ్మతు పనులను శనివారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతీ కాలనీల్లో మిషన్ భగీరథ నీటిని సరఫరా చేయాలన్నారు. పనిచేయని చేతి పంపులకు మరమ్మతు చేయించాలన్నారు. గ్రామీణ ప్రజలకు తాగునీటి ఇబ్బంది లేకుండా చూడాలని తెలిపారు. గ్రామాలను పరిశుభ్రంగా ఉంచాలని, మురుగుకాల్వల్లో స్వచ్ఛత పనులు చేయాలని సూచించారు. పంచాయతీ కార్యదర్శులు విధుల్లో నిర్లక్ష్యంగా ఉంటే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఆయన వెంట కార్యదర్శి సాయికృష్ణ, తదితరులు ఉన్నారు.

భూభారతి అమలు, ఎల్టీఆర్ చట్టాన్ని ఉల్లంఘించొద్దు

ఆసిఫాబాద్‌అర్బన్: జిల్లాలోని ఏజెన్సీలో భూభారతి అమలు ఎల్టీఆర్ చట్టాన్ని ఉల్లంఘించొద్దని న్యాయవాది వాసం ఆనంద్‌కుమార్ తెలిపారు. జిల్లాకేంద్రంలోని ఆదివాసీ భవనంలో ఏజెన్సీలో భూ సమస్యలు, భూభారతి చట్టం అమలుపై శనివారం సమావేశం నిర్వహించారు. ఏఈడబ్ల్యూసీఏ రాష్ట్ర ప్రధానకార్యదర్శి జనార్దన్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఏజెన్సీలో అనేక భూసమస్యలు ఉన్నాయన్నారు. ఆదివాసీలు భూములు సాగుచేసుకుంటున్నారే తప్పా భూమి రికార్డుల్లో తమ పేరు నమోదు కాకపోవడంతో రైతుభరోసా, రైతుబీమా, కిసాన్ యోజన వంటి సంక్షేమ ఫలాలను వారికి చేరడం లేదన్నారు. భూభారతి చట్టం ద్వారా భూ సమస్యలన్నింటికీ పరిష్కరిస్తామని రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిందన్నారు. అందులో భాగంగా ఏజెన్సీలో రైతులకు రికార్డులపై అవగాహన లేకపోవడం వారికి శాపంగా మారిందన్నారు. కార్యక్రమంలో దేవేందర్ సిడాం అర్జు, మోతీరాం, బాజీరావ్, మాణిక్‌రావ్, రాజకుమార్, సిడాం శంకర్, తదితరులు పాల్గొన్నారు.